శనివారం 27-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 406 పేజీలు: 4 | ₹6


EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com




జేబులో చేతులు పెట్టుకొని పార్లమెంట్‌కు వస్తావా..

మిగతా 2లో



అంతరిక్షంలోనే ఉన్న సునీతా విలియమ్స్

మిగతా 2లో



17 ఏళ్ల నాటి హత్య కేసులో 14 మందికి జీవిత ఖైదు

మిగతా 3లో



పాముల జాతరలో పాములతో ఆటలు

మిగతా 4లో

## ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తాం

- మా దళాలు శత్రువులకు తగిన జవాబిస్తాయి
- కార్గిల్ యుద్ధానికి లద్ధాఖ్ సాక్షిగా నిలుస్తోంది
- అమర జవాన్లకు నివాళులర్పించిన మోడీ

ముందడుగు జాతీయం:

ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తామని దాయాది దేశాన్ని ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి గట్టిగా హెచ్చరించారు. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన సైనికుల త్యాగాలకు యావత్ భారతావని ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. కార్గిల్ 25వ విజయ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం ఆయన లద్ధాఖ్ వెళ్లారు. ద్రాస్‌లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌పై విరుచుకుపడ్డారు. ''గతంలో పాకిస్థాన్ పాల్పడిన వికృత ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా, చరిత్ర నుంచి ఆ దేశం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదు సరికదా.. ఉగ్రవాదం, ప్రాక్సీ వార్‌తో ఇంకా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ రోజు నేను మాట్లాడే మాటలు.. ఉగ్రవాదులను తయారుచేస్తున్న వారికి (పాక్ సైన్యాన్ని ఉద్దేశిస్తూ) నేరుగా వినబడతాయి. ముష్కరులను పెంచి పోషిస్తున్న వారికి నేను చెప్పేది ఒక్కటే.. వారి దుర్మార్గపు కుట్రలు ఎన్నటికీ ఫలించవు. మా దళాలు ఉగ్రవాదాన్ని నలిపివేసి.. శత్రువులకు తగిన జవాబిస్తాయి'' అని మోడీ




పాక్‌ను హెచ్చరించారు. ''కార్గిల్ యుద్ధానికి లద్దాఖ్ సాక్షిగా నిలుస్తుంది. అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. మన బలానికి, సహనానికి, వాస్తవాలకు ఈ విజయగాథ నిదర్శనం. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులు చిరకాలం గుర్తుండిపోతారు. కార్గిల్ యుద్ధ సమయంలో సామాన్యుడిగా సైనికుల మధ్య ఉండే అదృష్టం నాకు దక్కింది. దేశం కోసం వారు చేసిన పోరాటం నా మదిలో నిలిచిపోయింది అని తెలిపారు.



## భారత్‌లో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

ఏటా 2.5 శాతం కేసులు పెరుగుతున్నాయి

లోక్‌సభకు తెలిపిన ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా

ముందడుగు జాతీయం:

భారతదేశంలో రోజురోజుకు క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా లోక్‌సభకు తెలిపారు. ఈ నేపథ్యంలో క్యాన్సర్ రోగులకు అందుబాటు ధరలో చికిత్స, మందులు అందించేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొంది. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడిన జేపీ నడ్డా.. భారత్‌లో ఏటా క్యాన్సర్ కేసులు 2.5 శాతం పెరుగుతున్నట్లు వెల్లడించారు. పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు, మహిళల్లో రొమ్ము క్యాన్సర్ కేసులు పెరుగుతున్నట్లు చెప్పారు. దేశంలో ఏటా 15.5 లక్షల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నట్లు సభకు వివరించారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో క్యాన్సర్ చికిత్స కోసం వినియోగించే మందుల ధరలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు నియంత్రిస్తోందని తెలిపారు. ప్రభుత్వం విధించిన ధరల పరిమితి కారణంగా మిగతా 2లో

## ఆగష్టు చివరిలో పంచాయితీ ఎన్నికలు..?

- పాత రిజర్వేషన్ల ప్రకారం నిర్వహణ
- ఉన్నతాధికారులను ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

ముందడుగు తెలంగాణ:

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసి, ఆగస్టు నెల చివరి వరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే ఐదేండ్ల క్రితం ఎన్నికల్లో కేటాయించిన మిగతా 2లో




## స్వచ్ఛందంగా పేర్లు ప్రదర్శిస్తే ఓకే

- కాని ఎవరిని బలవంతం చేయలేం
- కావడి యాత్రపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

ముందడుగు జాతీయం:

ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్‌లో జరిగే కావడి యాత్ర మార్గంలో తినుబండారాలు విక్రయించేవారు దుకాణాలపై యజమానులు, సిబ్బంది పేర్లు ప్రదర్శించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలవగా మిగతా 2లో



ముందడుగు
శనివారం, 27-7-2024, హైదరాబాద్

## భారత్‌లో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు

(మొదటిపేజీ తరువాయి)

రోగులకు ఏటా రూ.294 కోట్లు ఆదా అవుతోందన్నారు. హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై సభ్యులు అడిగిన మరో ప్రశ్నకు నడ్డా స్పందిస్తూ.. ఈ విషయం ప్రభుత్వం దృష్టిలో ఉందని చెప్పారు. ఎక్కువ మంది వైద్యులు ఉండేలా మెడికల్ కాలేజీల విస్తరణ జరుగుతోందని వివరించారు. వైద్య విద్య యొక్క నాణ్యత, పరిమాణంలో సమతుల్యత ఉండాలన్నారు. 2014లో మెడికల్ కాలేజీల సంఖ్య 387 ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 731కి పెరిగినట్లు చెప్పారు. ఇక అదే సమయంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 51,348 సీట్ల నుంచి 1,12,112 (1.12 లక్షలు)కి పెరిగిందని నడ్డా సభకు తెలియజేశారు. వైద్య విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు 2014లో 31,185 ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 72,627కు పెరిగినట్లు వివరించారు.

## ఆగష్టు చివరిలో పంచాయితీ ఎన్నికలు..?

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు సమాచారం. శుక్రవారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగిసి ఆరు నెలలు కావస్తున్నందున రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు లేకుండా గత రిజర్వేషన్లనే కొనసాగించాలని, ఆగష్టు నెలలో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సమావేశంలో మంత్రి సీతక్కతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి వారం రోజుల క్రితం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని అధికారులకు సీఎం సూచించారు. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును రేవంత్‌కు అధికారులు వివరించారు. ఇప్పటికే కులగణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని అధికారులను సీఎం ప్రశ్నించారు. కర్ణాటకలో 2015లో, బీహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కులగణన చేసినా వివరాలు ఇంకా బయట పెట్టలేదని అధికారులు వివరించారు.

## స్వచ్ఛందంగా పేర్లు ప్రదర్శిస్తే ఓకే

(మొదటిపేజీ తరువాయి)

జులై 22న సుప్రీం విచారించి మధ్యంతర స్టే విధించింది. తాజాగా జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్‌ల ధర్మాసనం మధ్యంతర స్టేను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

గత ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లుగానే పేర్లను బహిర్గతం చేయమని ఎవరినీ బలవంతం చేయలేమని ధర్మాసనం పేర్కొంది. ఎవరైనా యజమానులు స్వచ్ఛందంగా పేర్లను ప్రదర్శించాలనుకుంటే వారిని ఆపేందుకు ఎవరూ బలవంతం చేయకూడదనే ఉద్దేశంతోనే స్టేను విధించామని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తమ స్పందనలు దాఖలు చేయాలని ప్రభుత్వాలను కోరింది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేసే ప్రత్యుత్తరాలపై తమ స్పందనలు నివేదించేందుకు పిటిషనర్లకు అనుమతిస్తూ తదుపరి విచారణ ఆగస్టు 5కి వాయిదా వేసింది. కావడి యాత్రలో దుకాణాలపై పేర్లు ప్రదర్శించాలనే ఆదేశాలను వ్యతిరేకిస్తూ తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా, ప్రొఫెసర్ అపూర్వానంద్, కాలమిస్ట్ ఆకర్ పటేల్ తదితరులు సుప్రీంలో పిటిషన్లు దాఖలు చేశారు. కావడి యాత్ర శాంతియుతంగా సాగేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని తాజాగా ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సమర్థించుకుంటూ సుప్రీంకోర్టులో వివరించింది.



## జేబులో చేతులు పెట్టుకొని పార్లమెంట్‌కు వస్తావా..

### మంత్రిపై లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం

ముందడుగు జాతీయం:

పార్లమెంట్ లోక్‌సభలో వర్షా కాల సమావేశాలు జరుగుతున్నాయి. బడ్జెట్ 2024పై చర్చ నడుస్తోంది. అధికార పార్టీపై ప్రతిపక్ష ఎంపీలు ప్రశ్నలు సంధిస్తున్నారు. కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ శుక్రవారం లోక్‌సభలో వాయిదా తీర్మానం నోటీసు ఇచ్చారు. చైనాతో సరిహద్దు పరిస్థితి.. భారీ వాణిజ్య లోటుపై చర్చించాలని కోరారు. ఇదిలావుండగా... శుక్రవారం లోక్‌సభలో ఆశ్చర్యకరమైన సంఘటన చోటుచేసుకుంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఓ మంత్రిపై మాత్రమే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానికి పార్లమెంట్ కార్యకలాపాలు జరుగుతున్న సమయంలో ఓ మంత్రి జేబులో పెట్టుకుని పార్లమెంటుకు వచ్చారు. ఈ విషయంపై స్పీకర్ ఓం బిర్లా మండిపడ్డారు. ఓం బిర్లా తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ.. "మంత్రి, మీ చేతులు మీ జేబులో పెట్టుకోవద్దు. ముందుగా, గౌరవనీయులైన సభ్యులారా.. మీ జేబులో చేతులు పెట్టుకుని సభకు రావద్దని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను." అని పేర్కొన్నారు.

## అంతరిక్షంలోనే ఉన్న సునీతా విలియమ్స్

### ఇప్పటికే నెలరోజులు ఆలస్యం ○ ఎప్పుడు తిరిగి వస్తారో తెలియదంటున్న నాసా

ముందడుగు డెస్క్:



వ్యోమగామి సునీతా విలియమ్స్ ఇంకా అంతరిక్షంలోనే ఉన్నారు. ఆవిడ రాక మరింత ఆలస్యం కానుంది. ఇప్పటికే ఆమె తిరుగుప్రయాణం నెల రోజులు ఆలస్యమైంది. తిరిగి భూమికి వచ్చే బోయింగ్ వ్యోమనౌకలో సమస్యలు తలెత్తడంతో .. ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్‌తో పాటు బుచ్ విల్మోర్ .. స్పేస్ స్టేషన్‌లోనే చిక్కుకున్నారు. అంతరిక్ష కేంద్రానికి వెళ్లి జూన్ మధ్యలోనే తిరిగి రావాల్సిన ఇద్దరు వ్యోమగాములు.. బోయింగ్ వ్యోమనౌకలో థ్రస్టర్ ఫెయిల్యూర్‌తో అక్కడే ఉండిపోయారు. బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో.. హీలియం వాయువు లీకవుతున్నట్లు కూడా గుర్తించారు. దీంతో ఆ ఇద్దరు వ్యోమగాములను నాసా అక్కడే ఉంచేసింది.

వ్యోమగాములు ఎప్పుడు తిరిగి వస్తారో తెలియదని, ఇంకా ఆ తేదీని నిర్ణయించలేదని నాసా కమర్షియల్ క్రూ ప్రోగ్రామ్ మేనేజర్ స్టీవ్ స్టిచ్ తెలిపారు. స్టార్‌లైనర్‌లోనే విల్మోర్, విలియమ్స్‌ను తీసుకురావడం తమ లక్ష్యం అని పేర్కొన్నారు. స్టార్‌లైనర్ వ్యోమనౌకలో సమస్యలు ఉత్పన్నమైన నేపథ్యంలో.. బ్యాకప్ ఆప్షన్లను కూడా పరిశీలిస్తున్నట్లు స్టిచ్ వెల్లడించారు. స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ క్యాప్సూల్ ద్వారా కూడా వ్యోమగాములను వెనక్కి తీసుకువచ్చే ప్రయత్నం జరుగుతున్నట్లు తెలుస్తోంది. నాసా వద్ద ఎప్పుడూ ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఉంటాయన్నారు. స్టార్‌లైనర్‌లో ఉన్న అయిదు థ్రస్టర్లు విఫలం అయ్యాయని, జూన్ ఆరవ తేదీన స్పేస్‌స్టేషన్‌తో డాకింగ్ సమయంలో ఈ సమస్య వచ్చినట్లు ఇంజనీర్లు చెప్పారు. దీంట్లో నాలుగు థ్రస్టర్లను రీయాక్టివేట్ చేసినట్లు నాసా పేర్కొన్నది. స్టార్‌లైనర్‌లోని థ్రస్టర్లను ఈ వారం చివరలో పరీక్షిస్తామని, మరింత డేటా సేకరించి సమీక్ష నిర్వహించనున్నట్లు బోయింగ్ అధికారి మార్క్ నప్పి తెలిపారు.

ముందడుగు
శనివారం, 27-7-2024, హైదరాబాద్

## 17 ఏళ్ల నాటి హత్య కేసులో
# 14 మందికి జీవిత ఖైదు
### అందులో తొమ్మిది మంది ఒకే కుటుంబం

ముందడుగు ఉత్తరప్రదేశ్:

17ఏళ్ల కింద జరిగిన ఒక హత్య కేసులో బదౌనీలో ప్రత్యేక కోర్టు జడ్జి సంచలన తీర్పు ఇచ్చారు. 14 మందికి జీవిత ఖైదు, జరిమానా విధించారు. వీరిలో తొమ్మిది మంది ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్ జిల్లా ఖర్కౌల్ గ్రామంలో పాన్ సింగ్ అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో వీరంతా దోషులుగా తేలడంతో ప్రత్యేక జడ్జి రేఖా శర్మ వారందరికీ శిక్షలు ఖరారు చేశారు. వీరిలో ఆరుగురికి రూ.50వేలు, ఎనిమిది మంది దోషులకు రూ.30వేలు చొప్పున జరిమానా విధించారని ప్రభుత్వం తరపు న్యాయవాది వెల్లడించారు. 2007 ఫిబ్రవరిలో కరీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖార్కౌల్ గ్రామంలో రాధేశ్యామ్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ ఘటన జరిగిన ఎనిమిది రోజుల తర్వాత అతడి కుటుంబసభ్యులు, బంధువులు పాన్ సింగ్ ఇంటిపై దాడి చేశారు. పోలీసులకు బాధిత కుటుంబం చేసిన ఫిర్యాదు వివరాల ప్రకారం..




పాన్‌సింగ్ ఇంటి వద్ద బహిరంగ కాల్పులు జరపడంతో పాటు కర్రలతో దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు. ఆ తర్వాత అతడిని గొడ్డలితో నరికి చంపారు.

ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు.. 12 మందిపై దోపిడీ, హత్య కేసులు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా మరో నలుగురిపైనా ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ఉండగానే వీరిలో ఇద్దరు మరణించారు. తాజాగా ఈ కేసు తుది విచారణలో రాధేశ్యామ్ సోదరుడు ఉర్మాన్‌తో పాటు 14మందిని దోషులుగా నిర్ధారించి వారందరికీ జీవిత ఖైదు విధిస్తూ జడ్జి రేఖా శర్మ తీర్పు ఇచ్చారు.

# పెట్రో ధరల తగ్గింపుపై సీతారామన్ కీలక వ్యాఖ్యలు
### రాష్ట్రాలు కలిసివస్తే నిర్ణయం తీసుకుంటాం

ముందడుగు జాతీయం:

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ కౌన్సిల్ ఇంధన ధరల తగ్గింపుపై ఓ నిర్ణయం తీసుకుంటుందని ఆమె వెల్లడించారు. అయితే రాష్ట్రాలు ఈ విషయంలో కలిసివస్తే ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. నిర్మలా సీతారామన్ శుక్రవారం ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పలు అంశాలపై మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగలేదని చెప్పారు. బీజేపీ భాగస్వామ్య పక్షాలు అధికారంలో ఉన్న ఏపీ, బిహార్‌లను మాత్రమే బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారని విపక్షాల విమర్శలను ఆమె తోసిపుచ్చారు.



2014లో రాష్ట్ర విభజన జరిగిన క్రమంలో ఏపీకి విభజన చట్టం ప్రకారం సాయం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. గతంలో మాదిరే రాష్ట్రాలకు కేటాయింపులు జరిగాయని, ఏ ఒక్క రాష్ట్రానికీ నిధులను నిరాకరించలేదని అన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఏపీ నూతన రాజధాని నిర్మాణంతో పాటు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం సాయం చేయాల్సి ఉందని చెప్పారు. మరోవైపు మోదీ 3.0 ప్రభుత్వ తొలి బడ్జెట్‌పై విపక్షాలు భగ్గుమన్నాయి.

## కమ్ బ్యాక్ పేరుతో
# గ్యాంగ్ స్టర్ భారీ ర్యాలీ
### జైలు నుంచి బయటకు రాగానే కేసు నమోదు

ముందడుగు మహారాష్ట్ర:

ఓ గ్యాంగ్ స్టర్ కోరి సమస్యలు తెచ్చుకున్నాడు. జైలు నుంచి విడుదలైన ఆనందంలో ప్రదర్శించిన ఆనందం కాసేపు కూడా లేకుండా మళ్లీ జైలు పాలయ్యాడు. మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ హర్షద్ పాటంకర్ హత్యాయత్నం, దొంగతనాలు వంటి కేసుల్లో గతంలో అరెస్టయ్యాడు. అయితే, జులై 23వ తేదీన అతడు జైలు నుంచి విడుదలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న అతడి మద్దతుదారులు భారీ ర్యాలీ చేపట్టారు. బేతేల్ నగర్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకూ 'కమ్ బ్యాక్' ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా హర్షద్ సన్‌రూఫ్ కారులో వెళ్తుండగా.. పలు కార్లు, సుమారు 15 ద్విచక్ర వాహనాలు అతడిని అనుసరించాయి. ఈ సందర్భంగా కారు రూఫ్ నుంచి హర్షద్ తన మద్దతుదారులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఇందుకు



సంబంధించిన వీడియోని అతడి మద్దతుదారులు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అదికాస్తా వైరల్‌గామారి పోలీసుల దృష్టికి చేరింది. దీంతో పోలీసులు హర్షద్‌పై చర్యలు చేపట్టారు. అనధికారిక ర్యాలీని నిర్వహించి గందరగోళం సృష్టించినందుకు గానూ హర్షద్‌తోపాటు ఆరుగురు మద్దతుదారులపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు వారందరినీ అరెస్ట్ చేసి జైలుకు పంపారు.



# మల్లన్న సేవలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి

ముందడుగు శ్రీశైలం:

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను డోన్ ఎమ్మెల్యే జయ సూర్య ప్రకాష్ రెడ్డి శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద శ్రీశైల దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, ఏఈఓ శ్రీనివాసరావు, అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. స్వామి అమ్మవార్ల ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం ఈవో డి.పెద్దిరాజు వారికి శేష వస్త్రం, లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

## మరో నాలుగు రోజులు
# భారీ వర్షాలు..
### ఆరు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ



ముందడుగు:

రాష్ట్రంలో వారం రోజులుగా విస్తారంగా వర్షా లు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం మరోసారి వర్షం హెచ్చరికలు జారీచేసింది. మరో నాలుగు రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా కుండపోత వర్షా లు కురుస్తాయని హెచ్చరించింది. ముఖ్యంగా నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మెదక్‌లో ఈదురుగాలలతో భారీ నుంచి అతిభారీ వర్షా లు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌తో పాటు జగిత్యాల, మెదక్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, నాగర్‌కర్నూలు, వనపర్తి జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేసింది. భారీ వర్షా ల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. గత 24 గంటల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లిలో అత్యధికంగా 5.76 సెం.మీ వర్షపాతం నమోదైంది.

ముందడుగు
శనివారం,
27-7-2024,
హైదరాబాద్

### భోజనంలో ఊరగాయ ఇవ్వని హోటల్ సిబ్బంది

# వినియోగదారుల ఫోరంలో వ్యక్తి ఫిర్యాదు

## హోటల్‌కు రూ.35వేల జరిమానా




ముందడుగు తమిళనాడు:

భోజనంలో ఊరగాయ వెయ్యలేదని హోటల్ యజమాన్యానికి వినియోగదారుల ఫోరం రూ. 35వేల జరిమానా విధించింది. పూర్తి వివరాల ప్రకారం తమిళనాడు రాష్ట్రం విల్లుపురానికి చెందిన ఆరోగ్యస్వామి ఓ హోటల్‌లో 25 భోజనాలు ఆర్డర్ ఇచ్చాడు. ఆ భోజనాలను తీసుకెళ్ళి తింటుండగా ఊరగాయ కనిపించలేదు. భోజనం తినేవారిలో అత్యధిక శాతం మంది ఊరగాయ ఇష్టపడే వారు ఉన్నారు. దీంతో ఆరోగ్యస్వామి హోటల్ యజమానిని ఊరగాయ పచ్చడి వేయలేదని తెలియజేశాడు. అందుకు ఆ హోటల్ యజమాని ఆరోగ్యస్వామి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. దీంతో చిర్రెత్తుకొచ్చిన ఆరోగ్యస్వామి వినియోగదారుల ఫోరం కమిషన్‌ను ఆశ్రయించారు. దాదాపు రెండేళ్లుగా ఈ అంశంపై పోరాడారు. చివరకు ఈనెల 25న వినియోగదారుల ఫోరం కమిషన్ ఆ హోటల్‌పై చర్యలకు ఉపక్రమించింది. ఊరగాయ వేయడం మరచిపోవడం... కస్టమర్ పట్ల అనుచితంగా ప్రవర్తించినందుకు రూ.35 వేల జరిమానా విధించింది. అంతేకాదు ఆరోగ్యస్వామి ఖర్చుల నిమిత్తం రూ.5వేలు చెల్లించాలని ఆదేశించారు. అలాగే ఊరగాయల ప్యాకెట్లకు మొత్తం రూ.25 చెల్లించాలని వినియోగదారుల ఫోరం కమిషన్ ఆదేశించింది. ప్రస్తుతం ఈ అంశం సోషల్ మీడియాలో ఆసక్తికరంగా మారింది.

### శ్రమరహితంగా నగదును అందించే

# కొత్త క్రెడ్ ఉత్పత్తి



ముందడుగు హైదరాబాద్:

శ్రీమంతులకు అత్యంత రివార్డులు అందించే చెల్లింపుల ప్లాట్‌ఫారం క్రెడ్, ఇప్పుడు నగదు నిర్వహణ అనుభవంలో మార్పులు తీసుకువచ్చేలా తీర్చిదిద్దారు. వ్యక్తిగతంగా నగదు నిర్వహణను భయపెట్టేలా కాకుండా, స్ఫూర్తిదాయకంగా క్రెడ్ చేస్తుంది. ఆర్థిక పురోగతికి విశ్వసనీయ, తెలివైన మరియు సహాయక మార్గదర్శిగా ఇది నిలుస్తుంది. నగదు నిర్వహణకు పరిపాలనాపరమైన పర్యవేక్షణ సమయం మరియు సంపదతో విపరీతంగా పెరుగుతుంది. కాలక్రమేణా, లావాదేవీలు పలు ఖాతాలుగా విడిపోతాయి.

క్రెడ్ వ్యవస్థాపకుడు కునాల్ షా మాట్లాడుతూ, "మరింత డబ్బు, మరిన్ని సమస్యలు. సంపన్నులకు, ఆర్థిక నిర్వహణ అనేది తరచుగా ఆందోళనకు దారితీసే సంక్లిష్టతలను సూచిస్తుంది. మేము ప్రతి సంపన్న వ్యక్తికి డబ్బుతో సంబంధాన్ని మెరుగుపరిచే ఒక ఉత్పత్తిని రూపొందించాము. విశ్వసనీయమైన, అంతర్దృష్టి కలిగిన అనుభవం ద్వారా దాని గురించి వారిని తక్కువ ఆందోళన కలిగి ఉండేలా చేశాము. క్రెడ్ మనీ అనేది డబ్బుపై ఎక్కువ నియంత్రణను కలిగి ఉండాలనుకునే వారి కోసం కాగా, అలా చేయడంలో బాధ లేకుండా చేస్తుంది" అని వివరించారు.

## పాముల జాతరలో

# పాములతో ఆటలు

### 300 ఏళ్లగా కొనసాగుతున్న సంప్రదాయ జాతర

### దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు

ముందడుగు ప్రత్యేకం:

సంప్రదాయ, ఆచారాలను బట్టి పండుగలు, జాతరలు నిర్వహిస్తారు. ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆచారం ఉంటుంది. దానికి అనుగుణంగానే ఉత్సవాలు జరుపుతారు. పండుగల సమయంలో నిర్వహించే జాతరల గురించి మనం వినే వింటాం. కానీ మన దేశంలోని ఒక ప్రాంతంలో పాముల జాతర అట్టహాసంగా జరుగుతోంది. ఈ ప్రత్యేక పాముల జాతర బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో నిర్వహిస్తారు. సమస్తిపూర్‌లో ప్రతి సంవత్సరం నాగ పంచమి రోజున ఈ అద్భుతమైన పాముల జాతర నిర్వహిస్తారు. ఈ జాతరను చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటారు. ఈ జాతరలో కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్మకం. ఈ పాముల జాతర గత మూడు వందల సంవత్సరాలుగా సంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తున్నారు.



### భక్తితో పాలు, గుడ్లు

జిల్లాలోని సింఘియాలో నాగ పంచమి రోజున ఈ జాతర జరుగుతుంది. రాత్రంతా ప్రార్థనలు చేసిన తరువాత.. ప్రజలు ఊరేగింపుగా బయలుదేరి నదికి వెళతారు. స్నానం చేసి పాముకి పాలు, గుడ్డును భక్తితో సమర్పించుకుంటారు. ఇందులో వందలాది మంది భగత్‌లు (పాములను పట్టుకునే వ్యక్తులు) పాల్గొంటారు. బుధి గండక్ నదిలో స్నానం చేసి..ఆపై పాములను పట్టుకునే ఆట ప్రారంభమవుతుంది. గండక్ నదిలో స్నానం చేసి నీటిలో నుంచి పాములను చేతిలో పెట్టుకుని..నోటిలో కరచుకుని బయటకు తీస్తారు.

### డజన్ల కొద్ది పాములు

పాములు తన స్నేహితులంటూ మెడకు, చేతులకు చుట్టుకుంటారు. అక్కడి నుంచి ఊరేగింపుగా.. భగత్ రామ్ సింగ్ మాతా విశ్వ హరి ఆలయానికి వెళతారు. నది నుంచి డజన్ల కొద్దీ పాములను బయటకు తీసినట్లు చెబుతారు. వాటిలో చాలా విషసర్పాలు ఉన్నాయి. నదిలో నుంచి ఎవరు ఎన్ని పాములను త్వరగా బయటకు తీయాలన్న పోటీ నెలకొంది. ఈ రోజున ఇక్కడి ఆలయంలో కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రజలు చెబుతారు. సిద్ధి పూర్తయిన తర్వాత నది నుంచి బయటకు తీసిన పాములను సురక్షిత ప్రదేశాల్లో వదిలేస్తామని పాములను తొలగించే భక్తులు చెబుతున్నారు. దేశం మొత్తం మీద సమస్తిపూర్‌లో మాత్రమే పాముల జాతర నిర్వహించబడుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

## స్నికర్స్ కోసం బ్రాండ్ అంబాసిడర్‌గా చక్రం తిప్పిన రోహిత్ షెట్టీ

ముందడుగు హైదరాబాద్:

బాలీవుడ్ డైరెక్టర్ మరియు యాక్షన్ దిగ్గజం రోహిత్ షెట్టీని స్నికర్స్ కోసం కొత్త అంబాసిడర్ గా మార్స్ రిగ్లీ ఇండియా ఉల్లాసంగా ప్రకటించింది. ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, యాక్షన్ నిండిన ఫిల్మ్స్ కు ప్రసిద్ధి చెందిన షెట్టీ స్నికర్స్ బ్రాండ్ ను పెంచడానికి తన గొప్ప ఆకర్షణ మరియు డైనమిక్ స్టైల్ ను తెచ్చారు. ఈ సహకారం దిగ్గజపు "యు ఆర్ నాట్ యు వెన్ యు ఆర్ హంగ్రీ" కాంపైన్ లో ఉత్తేజభరితమైన అంశంగా నిలిచింది. ఇది ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని అంచనాలు.




హంగల్ డ్రైవింగ్ స్కూల్ కారులో ఒక బాలుడుకి బోధిస్తున్న రోహిష్ షెట్టీతో ఫిల్మ్ ప్రారంభమైంది. బాలుడు తక్కువ స్థలం ఉన్న చోట డ్రైవింగ్ తో శ్రమిస్తున్న కారణంగా, షెట్టీ నియంత్రిస్తూ, తన సిగ్నేచర్ నిర్వహణ నైపుణ్యాలు చూపిస్తున్నారు మరియు తన ప్రతిభతో బాలుడ్ని ఆకట్టుకుంటున్నారు. కారు ఆకస్మికంగా ఆగిపోతుంది, షెట్టీ హాస్యభరితంగా వెనకకు తిప్పి రద్దీగా ఉండే చేపల మార్కెట్ కు తీసుకువెళ్లారు. సముద్రం మంధ్యలో ఒక ఓడపై కారు ఆగినప్పుడు అంతిమ మలుపు తిరిగింది. బాలుడు షెట్టీ చేతిలో స్నికర్స్ ఉంచి, "నీకు ఆకలి వేసినప్పుడు నువ్వు రోహిత్ షెట్టీ అవుతావు" అన్నాడు. షెట్టీ స్నికర్స్ తిన్నాడు మరియు ప్రశాంతమైన డ్రైవింగ్ ఇన్ స్ట్రక్టర్ గా మారిపోయాడు, ట్యాగ్ లైన్ ప్రభావం ప్రధానంగా చూపించారు.

ముందడుగు
శనివారం,
27-7-2024,
హైదరాబాద్

# దగ్గు మందు పేరుతో విషం అమ్ముతున్నారు

- 141 మంది పిల్లల ప్రాణాలు తీసారు
- 2022లోనే తేల్చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ




ముందడుగు డెస్క్:

ఇండియాలో గతకొన్ని సంవత్సరాలుగా 100కు పైగా కంపెనీలు చిన్న పిల్లల దగ్గుమందు టానిక్ లను ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు సరఫరా చేస్తున్నారు. ఇండియాలో 100కు పైగా ఫార్మా కంపెనీలు ఔషదాలు అంటూ.. విషాన్ని అమ్ముతున్నాయి. గాంబియా, ఉజ్బెకిస్తాన్ మరియు కామెరూన్ దేశాల్లో పదుల సంఖ్యలో పిల్లల మరణాలకు ఆ టానిక్ లే కారణమైయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022లోనే తేల్చి చెప్పింది. గాంబియా దేశంలో 2022 మేలో 66 మంది చిన్నారులు ఇండియా ఉత్పత్తి చేసిన దగ్గు మందుల కారణంగా చనిపోయారనే వార్త అప్పట్లో కలకలం రేపింది. ఆయా దేశాలు కొన్ని రకాల టానిక్ లను అప్పడే బ్యాన్ చేశాయి.

## నాణ్యతా ప్రమాణాలు లేవు

భారతీయ ఫార్మా కంపెనీలకు చెందిన 100కు పైగా దగ్గు సిరప్‌లు క్వాలిటీ పరీక్షలో ఫెయిల్ అయ్యాయని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ వెల్లడించింది. ఈ దగ్గు మందుల్లోని కొన్ని శాంపిళ్లలో డైథైలీన్ గ్లైకాల్, ఇథిలీన్ గ్లైకాల్ వంటి విష పదార్థాలు ఉన్నాయని తేలింది. డీఈజీ, ఈజీ, అస్సే, మైక్రో బ్యాక్టీరియా పెరుగుదల, పీహెచ్ వాల్యూ వంటి వాటి కారణంగా ఆయా సిరప్‌ల బ్యాచ్‌లను నాణ్యతా ప్రమాణాలు లేని వాటిగా అధికారులు గుర్తించారు.

## మరణాలకు దగ్గు మందే కారణం


సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగాల సహాయంతో ఆయా కంపెనీల సేల్స్, డిస్ట్రిబ్యూషన్ గుర్తించి ప్రొపైలిన్ గ్లైకాల్ పంపిణీదారులను తనిఖీ చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 141 మంది చిన్నారుల మరణాలకు భారత్‌లో ఉత్పత్తి అయిన దగ్గు మందులే కారణమని ఆరోపణలు రావడంతో.. ప్రభుత్వ, ప్రైవేటు ల్యాబ్‌లు దేశవ్యాప్తంగా టెస్టింగ్‌లు చేస్తున్నాయి.

# ఎక్కడికి పోతుంది సమాజం..
# అంధ బాలికపై అత్యాచారం..!

నమస్కారం, నమస్కారం, నమస్కారం !
ఇన్ని నమస్కారాలు ఎందుకు అని ఆలోచిస్తున్నారా! ఇవి పెరుగుతున్న నాగరికతకు, పెరుగుతున్న మానవ విలువలకు, పెరుగుతున్న స్త్రీ గౌరవానికి, పెరుగుతున్న మానసిక ఎదుగుదలకు.. ఇదంతా సమాజంలో ఉన్నాయి అనుకుంటున్నారా.. ! మలక్ పేట ప్రభుత్వ అంధ బాలికల హాస్టల్లో మూడో తరగతి చదువుతున్న అంధ బాలికపై అత్యాచారం ఘటన నన్ను కదిలించింది.

సమాజంలో నుండి దూరం అయ్యి చాలా రోజులు అయ్యింది. కానీ మన సమాజం మాత్రం ఇంకా నిద్రపోతూనే ఉంది. ఎందుకంటే మన ఇంట్లో , మన వాళ్ళకి మన చెల్లికి, అక్కకి జరగలేదుగా.. అయిన జరిగినా చెప్పకునే స్వాతంత్ర్యం ఉందా! అంధురాలు అయిన చిన్న బాలిక పైన అత్యాచారం, నెలల పాప మీద అత్యాచారం. వావి వరసలు లేవు ఆడపిల్ల అయితే చాలు అనే కుసంస్కార సమాజం వైపు వెళ్తున్నాం. ఆడపిల్లని చదివించడం కోసం పోరాటం చేసాము. ఆడపిల్లలని కనడం పాపం అనే ఆలోచనలో మార్పు కోసం పోరాటం చేసాము.

ఇప్పుడు ఆడపిల్ల ఎంతో కొంత సమాజంలో నిలదొక్కుకుంటుంది అన్ని ఒత్తిడులని తట్టుకుంటూ అనుకుంటుంటే, ఇప్పుడు అస్సలు సమాజంలో అడపిల్లని కనాలి అంటేనే బయపడే దిశగా ఎదుగుతున్నాం. ఇప్పటికైనా ప్రశ్నిదాం. ఇప్పటికైనా ఆడపిల్లలని అడపిల్లలా కాకుండా సబల లాగా పెంచుదాము. అన్ని గవర్నమెంట్



వెల్ఫెయిర్ విమెన్ , గర్ల్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ని నియమించాలి. క్రమం తప్పని ఇన్స్పెక్షన్స్ జరగాలి. విమెన్ హాస్టల్ లో, శరణాశ్రమలల్లో విమెన్ ని మాత్రమే వర్కర్స్ గా నియమించాలి.

దయచేసి ప్రశ్నించండి , దయచేసి అవగాహన కల్పించండి. అమ్మాయిలని కనడానికే భయపడే పరిస్థితి నుండి కాపాడుకుందాం. ఎందుకంటే ఆ పరిస్థితి వస్తే మనం ఫ్యూచర్ జనరేషన్ కోల్పోయేది ఆడపిల్లను కాదు అమ్మని. నేను, ఆవేదనతో ఆరాటపడే ఒక అమ్మాయిని , ఒక భార్యను, ఒక అక్కని, ఒక చెల్లిని అన్నిటికీ మించి ఒక అమ్మను. ప్రతి అడపిల్లలో వుండే అమ్మ తత్వాన్ని చూడగలిగే సమాజం కోసం ఆశిద్దాం. మన వంతు సాయం చేద్దాం.

ఇట్లు
మీ మధ్యలోనే తిరిగే ఒక అడపిల్లని.
స్వప్న రాగి

# విశాల్‌ను టార్గెట్ చేసిన తమిళ నిర్మాతలు..
# దర్శకులు, టెక్నీషియన్లకు అల్టిమేటం!

ముందడుగు

నటుడు విశాల్, తమిళ నిర్మాతల మండలి మధ్య వివాదం ఇప్పుడు కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. హీరో విశాల్‌తో సినిమాలు తీయాలనుకునే దర్శకులు, నిర్మాతలు, టెక్నీషియన్లకు నిర్మాతల మండలి షాకిచ్చింది. ఎవరైనా సరే విశాల్‌తో సినిమా తీయాలంటే తమ వద్ద పర్మిషన్ తీసుకోవాల్సిందేనని కండీషన్ పెట్టింది. హీరో విశాల్ 2017-19 మధ్య తమిళ నిర్మాతల మండలి అధ్యక్షుడిగా పనిచేశాడు. ఆ సమయంలో రూ.12 కోట్లు దుర్వినియోగం చేశాడని ప్రస్తుత నిర్మాత మండలి సభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలోనే విశాల్‌తో ఎవరూ పనిచేయవద్దని ఓ లేఖను సైతం విడుదల చేశారు. కాగా, నిర్మాతల మండలి లేఖపై హీరో విశాల్ స్పందించారు. తాను సినిమాలు చేయకుండా ఎవరూ ఆపలేరని విశాల్ తెలిపారు. తాను మూవీస్ చేస్తూనే ఉంటానని కౌంటర్



ఇచ్చారు. నిర్మాతల మండలి అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి మంచే చేశానని, నిధులను వారి సంక్షేమం కోసమే వినియోగించానని స్పష్టం చేశారు. ఇప్పుడు నిర్మాతల మండలిలో ఉన్నవారు గతంలో తన కింద సభ్యులుగా ఉన్న వారేనని.. వారికి అన్ని నిజాలు తెలుసని చెప్పారు. తమిళ సినిమా పరిశ్రమలో అనేక సమస్యలు ఉన్నాయని, ముందుగా వాటిపై పోరాడితే బాగుంటుందని సూచించారు.

# సైనికుడిగా ప్రభాస్..
# కొత్త సినిమాకు ముహూర్తం ఖరారు..!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఈశ్వర్ సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో రంగ ప్రవేశం చేశాడు. ఆ తరువాత పలు సినిమాల్లో నటించి తన పురోగతిని సాధించాడు. అగ్ర దిగ్గజ దర్శ కుడు రాజమౌళి రూపొందించిన `బాహుబలి` చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. బాహుబలి-1 ,బాహుబలి-2 తరువాత ప్రభాస్ నటించిన రాధే శ్యామ్, సాహో చిత్రాలు యావరేజీగా నిలవగా.. ఆదిపురుష్ చిత్రం డిజాస్టర్ అనిపించుకుంది. ఏడాది క్రితం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన `సలార్` సినిమాతో మళ్ళీ ప్రభాస్ భారీ విజయాన్ని సాధించాడు. ఈ మధ్య కాలంలో విడుదలైన `కల్కి2898 ఏడీ` సినిమా బ్లాక్ బస్టర్ అవ్వడంతో మరోసారి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు ఈ పాన్ ఇండియా స్టార్. ప్రస్తుతం మారుతి దర్శకత్వలో రాజాసాబ్ అనే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నాడు. దీంతోపాటు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ అనే చిత్రం కూడా



చేయ్యబోతున్నాడు. అయితే ప్రస్తుతం తదుపరి చిత్రం గురించి మరో ఆసక్తికరమైన న్యూస్ కూడా వైరల్ అవుతుంది. ప్రభాస్ తరువాతి చిత్రం`సీతా రామం సినిమాను రూపొందించిన దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో `ఫౌజీ` అనే సినిమా రాబోతున్నట్లు ప్రకటించారు. దుల్కర్ సల్మాన్ , మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా హను రాఘవపూడి రూపొందించిన `సీతారామం`చిత్రం ఎంత భారీ విజయాన్ని సాధించిందో అందరికి తెలుసు.